క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గజ్వేల్: గజ్వేల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశం, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, అశోక్ తదితరులు శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మైక్రోబయాలజీ(పీజీ) బోధించేందుకు రెండు అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎమ్మెస్సీ మైక్రో బయాలజీలో ఎస్సీ, ఎస్టీలు 50 శాతం, బీసీ, ఓసీలు 55 శాతంతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, యూజీసీ, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం సాయంత్రంలోగా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 8న ఉదయం 11గంటలకు కళాశాలలో హాజరు కావాలని, దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూ డెమో క్లాసుల ద్వారా ఎంపిక చేస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కోడ్ ఉల్లంగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ వివేక్

నంగునూరు(సిద్దిపేట): ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని, కోడ్ ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ వివేక్ హెచ్చరించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో శనివారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నంగునూరులో సమావేశం నిర్వహించారు. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల అర్హత, ఖర్చులు, నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్, ఆర్‌ఐ లింగం, సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల ఉచ్చులో పడొద్దు



మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రావు

ములుగు(గజ్వేల్): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ అమర్‌నాథ్‌రావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ మ్యాగజైన్ ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు బండారు రాంపణిధర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో అమర్‌నాథ్‌రావు మాట్లాడారు. మాదకద్రవ్యాలు మానసిక, శారీరక ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలని, చదువులో వెనుకబడేలా చేస్తాయన్నారు. కార్యక్రమంలో శిక్షణ రిసోర్స్‌పర్సన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలలో సత్తా చాటండి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించి బీజేపీ సత్తాచాటాలని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బెజ్జంకిలో ఆ పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో కృషి చేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అజయ్‌వర్మ, మల్లేశం, రవి, సునీత, సుధీర్‌రావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ.. సాగు దండగ!

ప్రశ్నార్థకంగా మారిన పంట
- విత్తనం అధికం.. అందని సబ్సిడీ
- ప్రతియేటా తగ్గిపోతున్న విస్తీర్ణం
- ఆందోళనలో రైతులు



కోహెడలో దుక్కిదున్ని సిద్ధంగా ఉంచిన పొలం

కోహెడ(హుస్నాబాద్): వేరుశనగ సాగు ప్రశ్నర్థకంగా మారింది. ప్రతియేటా సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోతుంది. వందల ఎకరాల్లో తగ్గుముఖం పడుతోంది. ప్రభుత్వం విత్తనంపై సబ్సిడీ ఎత్తివేసింది. దీంతో రైతులల్లో సాగుపై ఆసక్తి తగ్గిపోయింది.

55 ఎకరాలు మాత్రమే..

ఈ యేడు వేరుశనగ కేవలం 55 ఎకరాల్లో మాత్రమే సాగయిందని అధికారులు చెప్పున్నారు. కొంత మంది రైతులు దుక్కులు సిద్ధం చేశారు. వారంలోగా సాగు పూర్తి కానుంది. అధికారులు కొన్ని ఎరువుల దుకాణాలలో చాలా తక్కువ స్థాయిలోనే విత్తనాలు అందుబాటులో ఉంచారు.

భయపెడుతున్న విత్తన ధర

మార్కెట్‌లో కె6 రకం వేరుశనగ క్వింటాలుకు రూ.10 వేలు ధర ఉంది. ధరలు చూసే రైతులు భయపడుతున్నారు. దీంతో సాగు చేయాలంటే ముందుకు వచ్చే పరిస్థితి లేదు. అందుకే ప్రతియేటా సాగు తగ్గుముఖం పడుతుంది. గత యేడాది 125 ఎకరాల్లో సాగైతే ఈ ఏడాది సగానికి తగ్గిపోయింది.

గిట్టుబాటు ధర కష్టమే..

అష్ట కష్టాలు పడి సాగుచేస్తే తీరా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదు. పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు సాగుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఐతే రానున్న కాలంలో వేరుశనగ మరింత ప్రియం కానుంది.

సబ్సిడీపై విత్తనం అందించాలి



ప్రభుత్వం వేరుశనగ రైతులకు సగం సబ్సిడీతో పల్లికాయ సరఫరా చేయాలి. పండించిన పంటకు క్వింటాలుకు రూ.15 వేలు మద్దతు ధర కల్పించాలి. సాగుచేస్తున్న రైతులను ప్రోత్సహించాలి.

– కృష్ణారెడ్డి, రైతు, కోహెడ

అందుబాటులో ఉంచాం



వేరుశనగ విత్తనం దుకాణాలలో అందుబాటులో ఉంచాం. ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేకపోవడంతో సాగుకు రైతులు ముందుకు రావటం లేదు. దీంతో రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. పలుషాపులలో కె6 రకం విత్తనం 30 కిలోల బస్తా రూ.3 వేలకు అందుబాటులో ఉంది.

– సతీశ్, ఏఓ, కోహెడ

ఉన్నత స్థాయికి ఎదగడంలోనే సంతోషం

సాంఘికశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు



అఖిల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడంలోనే ఎంతో ఆనందం ఉందని సాంఘికశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచందర్‌రావు అన్నారు. గ్రూప్–1లో రాణించి డీఎస్పీగా ఎంపికైన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు వజ్రమ్మ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్రా భగవాన్‌రెడ్డిల కుమారుడు నర్రా అఖిల్‌రెడ్డికి సాంఘికశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ అఖిల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఆశావహులు రాణించాలన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, పట్నం భూపాల్, బాలరాజు, వేణు మాధవ్, నాగరాజు, చంద్రమౌళి, రవీందర్‌రెడ్డి, నాగరాజు, రాంగోపాల్ రెడ్డి, హర్ష రాములు పాల్గొన్నారు.

కురుమల అలయ్‌బలయ్



ఐక్యత చిహ్నం చూపుతున్న కురుమ కులస్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కురుమ కులస్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి సత్తా చాటాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన 18 శాతం ఉన్న కురుమలు విద్య, వైద్యం, ఉద్యోగ, రాజకీయరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. మేమెంతో.. మాకంత వాటా వచ్చేంత వరకు పోరాడతామని చెప్పారు. రాజకీయపార్టీలు కురుమలకు సముచిత స్థానం కల్పించి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా శోభాయాత్ర

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలు కనులపండువగా సాగాయి. యువతీ యువకుల కోలాటలు, నృత్యాలు, డీజే డ్యాన్స్‌లతో హోరెత్తాయి. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



దుద్దెడలో తరలివెళ్తున్న అమ్మవారు



మర్పడ్గలోని దుర్గామాత నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు



కొండపాక(గజ్వేల్): దుద్దెడలో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న యువతులు



దుబ్బాకలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): గంగాపూర్‌లో ..

నేడు పుస్తకావిష్కరణ

సిద్దిపేటకమాన్: శ్రీమన్నారాయణ శ్రీలహరి కృష్ణ 'అమృత మంజరి–భాగం 2' పుస్తకావిష్కరణ కార్యక్రమం సిద్దిపేటలో ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకే దేవుడు ఒకే దేశం అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భక్తులు, వక్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో శంకరయ్య, లక్ష్మణ్‌రావు, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత శ్రీరాంరెడ్డి శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు



జీపీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో జరిగిన కోతుల దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. చిన్నారులు ఆరుబయట ఆడుకుంటుండగా కోతులు ఓ చిన్నారి కృతికపై దాడి చేశాయి. వెంటనే స్థానికులు కోతుల మందను తరిమేశారు. అయితే కోతుల దాడిలో చిన్నారి కృతికకు కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, గ్రామంలో కోతులను నివారించడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యదర్శి రమాదేవితో వాగ్వాదానికి దిగారు. నివాసగృహలకు సమీపంలో ఉన్న ప్రకృతివనంలో కోతుల బెడదఎక్కువైందని వాపోయారు. కోతులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

సొంత నిధులతో బోరు మోటారు ఏర్పాటు



బోరు వద్ద కాలనీవాసులతో దావూద్

నర్సాపూర్: మున్సిపాలిటీలోని మూడో వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దావూద్ తమ వార్డులో నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా సొంత నిధులతో వార్డు పరిధిలో బోరు డ్రిల్లింగ్ వేయించారు. ఈ మేరకు శనివారం మోటారు బిగించి నీటి సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చారు. బోరు వేయించడంతో కాలనీలో నీటి సమస్య తగ్గిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట ధర్నా

సీపీఐ జిల్లా నాయకుడు ఎల్లయ్య



మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మరో సారి శాస్త్రీయంగా సర్వే చేయాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలోని 20 గ్రామాల మీదుగా ట్రిపుల్‌ఆర్ వెళ్తున్నందన్నారు. ఔటర్ రింగురోడ్డు నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉండాల్సిన ఈ రహదారి 30 కిలోమీటర్ల కంటే తక్కువగా కుదించి పేద రైతులు రోడ్డున పడే విధంగా అలైన్‌మెంట్‌ను మార్చారని విమర్శించారు. రైతులకు భూములు పోతున్నాయంటూ నోటీసులు ఇస్తున్న అధికారులు నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వడం లేదని వాపోయారు. గజ్వేల్ ప్రాంతంలో ఎకరాకు రూ.1 నుంచి రూ. 3 కోట్ల వరకు ధర పలుకుతుందని, రైతులందరికీ భూమికి బదులు భూమి ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూములను తీసుకున్నప్పటికీ మార్కెట్ రేటుతో మూడు రెట్లు పెంచి ఇవ్వాలన్నారు. భూములు కోల్పోతున్న జగదేవ్‌పూర్, మర్కూక్, వర్గల్, గజ్వేల్, రాయపోల్ మండలాల రైతులు ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత యువడిపై దాడి అమానుషం

దళిత, ప్రజా సంఘాల నేతలు



మహిపాల్‌ను పరామర్శిస్తున్న నాయకులు

గజ్వేల్: జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో దళిత యువకుడు దేవి మహిపాల్‌పై జరిగిన దాడి అమానుషమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. గాయాలపాలై గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని శనివారం మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్, దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి, నాయకుడు పొన్నాల కుమార్ పరామర్శించారు. గొర్రెలను మేపడానికి వెళ్లిన మహిపాల్‌పై కొందరు పాతకక్షలతో దాడిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిపై విచారణ జరిపేందుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదివారం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి రానున్నట్టు చెప్పారు. పరామర్శించిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): కొండపాకలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు నిర్వాహకులు ట్రోఫీ, బహుమతులు ప్రదానం చేశారు. విన్నర్ టీమ్‌కు రూ.20 వేలు, రన్నర్ టీమ్‌కు రూ.10 వేలు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా దాత, బీజేపీ నాయకుడు మంచాల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. నాలుగు రోజులపాటు ప్రశాంతంగా పోటీలు నిర్వహించిన క్రికెట్ టీం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యం, కిరణ్, క్రికెట్ టీం నిర్వాహకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



దుర్గామాతను దర్శించుకొంటున్న రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: యువత మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దని, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల, బట్టిరామన్నపల్లిలోని అమ్మవార్లను శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సమాజహిత కార్యక్రమాలు నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. గతంలో కంటే ఎక్కువగా యువకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

పేదరికంలో విరబూసిన విద్యా కుసుమం



సౌమ్య

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని నిరూపించింది ఓ పేద విద్యా కుసుమం. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో పట్టుదలగా చదివి మెడిసిన్‌లో సీటు కై వసం చేసుకుంది. మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన సుంకరి కొండల్ బాలమణి పెద్ద కుమార్తె సౌమ్య నీట్ ఫలితాల్లో 4158వ ర్యాంకు సాధించి వరంగల్‌లో మెడిసిన్ సీటును సాధించింది. ఆమె తండ్రి కొండల్ ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి బాలమణి బీటీ కార్మికురాలిగా పని చేస్తున్నారు. పేదరికం అడ్డుపడుతున్నా మొక్కవోని దీక్షతో చదివి మెడిసిన్‌లో సౌమ్య సీటు సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం అభినందించారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన 'ఆల్ ద బెస్ట్' సంస్థ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు నారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు తాము సేవలందించిన రంగాలకు సంబంధించిన సర్టిఫికెట్‌లు, ఫొటోలు, దినపత్రికలలో వచ్చిన కథనాలను 10వ తేదీలోగా పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అల్లుకున్న అలసత్వం



ఎల్లాయపల్లిలో పిచ్చిమొక్కల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మండల పరిధిలోని ఎల్లాయపల్లి బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంప చెట్లతో నిండిపోయింది. దాని చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు అల్లుకుపోయాయి. ఎవరూ గుర్తించలేని విధంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)